క్లుప్తంగా

గ్రామాల్లో హరితహారం



మొక్కలు నాటుతున్న ఉపాధి కూలీలు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని అంతక్కపేట గ్రామ ప్రధాన రహదారి రోడ్డుకు ఇరువైపులా ఉపాధి హామీ కూలీలు శనివారం మొక్కలు నాటుతున్నారు. గ్రామాల్లో ఏర్పాటు చే సిన నర్సరీల్లో పెరిగిన మొక్కలను రోడ్డుకి రువైపులా, ఖాళీ ప్రదేశాల్లో నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి గ్రామంలో పచ్చదనం ఉట్టిపడేలా హరితహారంలో భాగంగా మొక్కలను నాటి వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకుంటున్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని మందాపూర్ గ్రామానికి చెందిన గువ్వ కుమార్ ఇటీవల అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. శనివారం తనతో పాటు చదువుకున్న పదో తరగతి విద్యార్థులు కుమార్ కుటుంబానికి రూ.20 వేలు అందించి మానవత్వం చాటుకున్నారు. కుమార్ కుటుంబానికి ఆండగా వారు ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో మిత్ర బృందం పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠోత్సవాలు



అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని ధర్మారం గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠ ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అదేవిధంగా నూతనంగా గ్రామంలో నిర్మించిన దుర్గామాత ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు కూడా ప్రారంభమయ్యాయి. శనివారం సాయంత్రం మహిళలు జలకడవలతో బొడ్రాయికి జలాభిషేకం చేశారు. ఆదివారం ఉదయం బొడ్రాయి ప్రతిష్ఠ ఉంటుందని, అనంతరం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందని సర్పంచ్ రాజు, ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

సంబరాల పేరుతో ప్రజాధనం వృథా



సభ్యులకు నియామకపత్రం అందజేస్తున్న యాదగిరి

నంగునూరు(సిద్దిపేట): తెలంగాణ సంబరాల పేరుతో ప్రజాధనం వృథా చేసిన కేసీఆర్‌కు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని టీపీసీసీ కార్యదర్శి దేవులపల్లి యాదగిరి పిలుపునిచ్చారు. శనివారం ఖానాపూర్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం యాదగిరి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అమలు కాని హామీలు ఇచ్చి ప్రజలను దగా చేశాడన్నారు. రైతుల లక్ష రుణమాఫీ, ఉచిత ఎరువులు, పంట నష్టం డబ్బులు ఇస్తామని చెప్పిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నితిన్‌కుమార్, నాయకులు రమేశ్, నవీన్, ప్రవీన్, నగేశ్, యాదగిరి, రాంగారెడ్డి, నాగరాజు, ముస్త్యాల యాదగిరి, కనకయ్య, కృష్ణ పాల్గొన్నారు.

స్వచ్ఛతకు సహకరించాలి



అవగాహన కల్పిస్తున్న చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్‌రూరల్: పట్టణంలోని 2వ వార్డులో రీ థింక్ డేను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత మాట్లాడుతూ.. మనకు అవసరం లేని వస్తువులు వేరొకరికి ఉపయోగపడే విధంగా మన ఇంట్లో వాడని వస్తువులు చెప్పులు, ఎలక్ట్రానిక్ వస్తువులు పాతబట్టలు, ప్లాస్టిక్ వస్తువులు, పాత పుస్తకాలు, బొమ్మలను ట్రిపుల్‌ఆర్ సెంటర్‌కు ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రమాదేవి, శ్రీలత పాల్గొన్నారు.

70 మంది.. ఒక ఉపాధ్యాయుడు

- బస్వాపూర్‌లో నలుగురు.. అంతాయిగూడలో ఒకరు
- ప్రభుత్వ పాఠశాలలో టీచర్ల తీరు



బస్వాపూర్ పాఠశాలలో..



అంతాయిగూడ పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు

గదేవ్‌పూర్(గజ్వేల్): విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఉన్న చోట ఉపాధ్యాయులు తక్కువ.. తక్కువ విద్యార్థులు ఉన్న చోట ఉపాధ్యాయులు ఎక్కువ ఉన్నారు. దీంతో విద్యార్థులకు సరైన విద్య అందడం లేదు. జగదేవ్‌పూర్ మండలంలోని అంతాయిగూడ గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు 70 మంది విద్యార్థులు ఉండగా ఒకే ఉపాధ్యాయుడు విధులు నిర్వహిస్తున్నారు. దీంతో ఇటీవల గ్రామ సర్పంచ్, గ్రామస్తులు కలిసి పాఠశాలకు ఉపాధ్యాయులను కేటాయించాలని ఎంఈఓతో మొరపెట్టుకున్నారు. గతేడాది ఇదే పరిస్థితి ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోయారు. ఇదిలా ఉండగా బస్వాపూర్ గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాల 1 నుంచి 7వ తరగతి కొనసాగుతోంది. ఈ పాఠశాలలో నలుగురు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. కాగా గతేడాది పిల్లల సంఖ్య తగ్గడంతో డిప్యూటేషన్‌పై వేరే పాఠశాలకు ఒకరిని పంపించారు. ఈ సారి పిల్లల సంఖ్య మరింత తగ్గింది. 1 నుంచి 4వ తరగతి వరకు 15 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ప్రస్తుతం నలుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. ఆ గ్రామంలో బడిబాట నిర్వహించిన ఫలితం లేకుండా పోయిందని ఉపాధ్యాయులే చెబుతున్నారు. విద్యార్థులున్న చోట ఉపాధ్యాయులు లేకపోవడం, ఉపాధ్యాయులున్న చోట విద్యార్థులు లేకపోవడం గమనార్హం.

నిర్వాసితులకు అండగా ప్రభుత్వం



డాక్యుమెంట్లు పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ములుగు(గజ్వేల్): భూ నిర్వాసితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ జహంగీర్, ములుగు పీఏసీఎస్ చైర్మన్ బట్టు అంజిరెడ్డిలు పేర్కొన్నారు. మండలంలోని తానెదార్‌పల్లి, తండా ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన 204 మందికి ములుగు రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ప్రవీణ్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి శనివారం డబుల్ బెడ్రూం ఇళ్ల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొండపోచమ్మ ప్రాజెక్ట్ నిర్మాణానికి భూములు ఇచ్చిన నిర్వాసితుల త్యాగం వెలకట్టలేనిదన్నారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీలలో నిర్వాసితుల కోసం అన్ని వసతులతో కూడిన సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దేవేందర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ భూపాల్‌రెడ్డి, ఎంపీటీసీ లింగారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర యువజన కార్యదర్శి జుబేర్‌పాషా, మండల బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు అయిలయ్య యాదవ్, నాయకులు అర్జున్‌గౌడ్, సత్తయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ పూర్వ వైభవానికి కృషి చేయాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): అనివార్య కారణాలతో ఆరేళ్లుగా పార్టీ కార్యకర్తలకు దూరంగా ఉన్నా నిరాశ చెందొద్దని, కంచుకోటకు చిరునామా అయిన జగదేవ్‌పూర్‌లో మళ్లీ పూర్వ వైభవం తీసుకురావడానికి ప్రతీ కార్యకర్త సిద్ధంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి అన్నారు. శనివారం జగదేవ్‌పూర్ మండల కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని కేశిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 9 ఏళ్ల పాలనలో జగదేవ్‌పూర్ అభివృద్ధి చెందలేదని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అసైన్డ్ భూములను తక్కువ ధరకు తీసుకొని కోట్ల రూపాయలకు ప్రైవేట్ సంస్థలకు అప్పగించి పేదల పొట్ట కొడుతుందన్నారు. రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, గాల్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, ఎంపీటీసీలు మహేశ్‌యాదవ్, మహేందర్‌రెడ్డి, మంజులమహేందర్ రెడ్డి, రాజు, మనోజ్, నర్సింలు, శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, లోకేశ్, శ్రావణ్, రమేశ్, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

రెండోరోజు భూనిర్వాసితుల దీక్ష



శిబిరంలో కూర్చున్న మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

వర్గల్(గజ్వేల్): ఫుడ్‌ప్రాసెసింగ్ పరిశ్రమల కోసం సేకరించిన తమ భూమికి చట్టబద్ధమైన పరిహారం అందించాలనే డిమాండ్‌తో వర్గల్ మండలం అవుసులోనిపల్లిలో చేపట్టిన భూ నిర్వాసితుల దీక్ష శనివారం రెండోరోజుకు చేరింది. మాజీ ఎంపీటీసీ యాదయ్య ఆధ్వర్యంలో కొనసాగుతున్న దీక్షకు మాజీ ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి సంఘీభావంగా శిబిరంలో కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూములు కోల్పోయిన వారికి చట్టబద్ధంగా పరిహారం అందేంత వరకు కాంగ్రెస్ అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ తోట ముత్యాలు, నాయకులు సందీప్‌రెడ్డి, సదానంద రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



గర్భిణులకు న్యూట్రీషన్ కిట్లు అందిస్తున్న సూపరింటెండెంట్ హేమరాజ్‌సింగ్

దుబ్బాక: గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పోషకాహారాన్ని తప్పక తీసుకోవాలని దుబ్బాక వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హేమరాజ్‌సింగ్ అన్నారు. శనివారం దుబ్బాక పట్టణంలోని వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణులకు న్యూట్రీషన్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందన్నారు. ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న న్యూట్రీషన్ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది తదితరులున్నారు.

కుట్టుశిక్షణతో యువతకు ఉపాధి



కుట్టుశిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన ప్రజాప్రతినిధులు

రాయపోలు(దుబ్బాక): యువతకు ఉపాధి కల్పించేందుకు తమవంతు ప్రయత్నిస్తామని ప్రజాహిత ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, బీఆర్ఎస్ నాయకులు మామిడి మోహన్‌రెడ్డి అన్నారు. దౌల్తాబాద్ మండల కేంద్రంలో సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యువతకు ఉపాధి కల్పించేందుకు తమవంతు కృషిచేస్తున్నట్లు చెప్పారు. దౌల్తాబాద్‌లో ఉచితంగా కుట్టుశిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, దీన్ని ఈ ప్రాంత గ్రామాల ఆడపడుచులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ యాదగిరి, ఎంపీటీసీ వనితవేణు, రాయపోలు జెడ్పీటీసీ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు



వర్గల్ విత్తన దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఏఓ శేషశయన, ఏఎస్సై మధుసూదన్‌రావు

వర్గల్(గజ్వేల్): మండల కేంద్రం వర్గల్, గౌరారంలో విత్తన దుకాణాలను శనివారం టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీ చేశారు. ఏఓ శేషశయన, గౌరారం ఏఎస్సై మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో బృందం ఆయా దుకాణాలు తనిఖీ చేశారు. ప్రధానంగా విత్తన ప్యాకెట్లపై ఫోకస్ చేశారు. ఎవరైన దుకాణాదారులు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు.

మంత్రి హరీశ్‌రావుకు వినతి

తొగుట(దుబ్బాక): మండలంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని మిరుదొడ్డి బీఆర్ఎస్ అధ్యక్షుడు తోట అంజిరెడ్డి శనివారం మంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రం అందజేశారు. మండలం పరిధిలోని గ్రామాల్లో అనేక సమస్యలు నెలకొన్నాయని మంత్రికి వివరించారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మంత్రికి విన్నవించినట్లు వారు తెలిపారు. ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో నాయకులు పరశురాములుగౌడ్, అంజయ్య, బాబు పాల్గొన్నారు.

రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ ఖాయం



పంతులుతండా గ్రామంలో ఇంటింటి ప్రచారం



గంగాపూర్‌లో..

అక్కన్నపేట(హుస్నాబాద్): రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ రావాలని ప్రజలే కోరుకుంటున్నారని, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ మండల అధ్యక్షుడు గొల్లపెల్లి వీరాచారి ధీమా వ్యక్తం చేశారు. శనివారం అక్కన్నపేట మండలం పంతులుతండా గ్రామంలో ఇంటింటికీ మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని మండల అధ్యక్షుడు వీరాచారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకసారి బీజేపీకి అధికారం ఇచ్చి చూడాలని అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తామన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అన్ని రంగాల్లో సంక్షేమ సుపరిపాలన సాధ్యమవుతుందని చెప్పారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం పదవి చేపట్టిన కేసీఆర్ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చలేదని విమర్శించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు చరమగీతం పాడేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారన్నారు. హుస్నాబాద్ గడ్డపై కాషాయ జెండా ఎగరవేస్తామన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కో-కన్వీనర్ జనగామ వేణుగోపాల్‌రావు, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు నూనావత్ మోహన్‌నాయక్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కర్ణకంటి నరేశ్, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి సంగ్రే సంతోష్, మండల కార్యదర్శి చెరుకు సంపత్, నాయకులు లావుడ్య సురేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని గంగాపూర్, విఠలాపూర్ గ్రామాల్లో బీజేపీ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. ప్రధాని మోదీ చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షులు పిట్ల పరశురాములు మాట్లాడుతూ.. బీజేపీతోనే సుస్థిర పాలన సాధ్యమన్నారు. అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజిరెడ్డి, గణేశ్‌రెడ్డి, చంద్రం, వేణు, యాదిరెడ్డి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి



చిన్నకోడూరులో కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



సిద్దిపేటకమాన్: పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): ముదిరాజ్‌లను అవమానపరిచిన ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శనివారం చిన్నకోడూరులో ఎమ్మెల్సీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి జంగిటి శ్రీనివాస్, నాయకులు శ్రీనివాస్, కనకయ్య, శ్రీకాంత్, సుధాకర్, యాదగిరి, అంజయ్య, బాల్‌రాజు, శరత్ పాల్గొన్నారు.

మర్కూక్(గజ్వేల్): ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిని పదవి నుంచి తొలగించి బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు సత్యనారాయణ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సీఎం కేసీఆర్ చిత్రపటానికి వినతిపత్రం అందించి మాట్లాడారు. సమావేశంలో ముదిరాజ్ సంఘం నాయకులు సత్యం, శ్రీను, భాస్కర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

కొమురవెల్లి(సిద్దిపేట): ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గొల్లపల్లి కిష్టయ్య డిమాండ్ చేశారు. శనివారం ఆ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో గొల్లపల్లి ఆంజనేయులు, చిక్కుడు కనకయ్య, శ్రీనివాస్, నాగరాజు, అంజయ్య పాల్గొన్నారు.

బెజ్జంకి(సిద్దిపేట): ముదిరాజ్‌లపై ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడంపై మండల ముదిరాజ్ సంఘం నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం వేరు వేరు కార్యక్రమాల్లో ఆగ్రహం వ్యక్తం చేశారు. బెజ్జంకి అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు, ముదిరాజ్ సంఘం నాయకులు దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమాల్లో ఆ సంఘం అధ్యక్షుడు పోచయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటకమాన్: అజయ్ ముదిరాజ్‌ను కులం పేరుతో దూషించిన పాడి కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ముదిరాజ్ మహాసభ సంఘం సభ్యులు అన్నారు. మహాసభ ఆధ్వర్యంలో చర్యలు తీసుకోవాలని సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మహాసభ అధ్యక్షుడు శంకర్, సిద్దిపేట అర్బన్ మండల అధ్యక్షుడు సిద్దిరాములు, కనకరాజు, కార్తీక్, ప్రశాంత్, శ్రీనివాస్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌రూరల్: ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఆ సంఘం నాయకులు శనివారం పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తా వద్ద దిష్టిబొమ్మను దహనం చేసిన అనంతరం గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సంఘం గజ్వేల్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు ఆంజనేయులు, రాజు, ప్రసాద్, భాస్కర్, బాల్‌చంద్రం, మురళి, గణేశ్, కనకయ్య, యాదగిరి, మల్లేశం, నాగరాజు, బాలయ్యతో పాటు ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన నాయకులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌రూరల్: ముదిరాజ్‌లకు ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని ముదిరాజ్‌ల సంఘం జిల్లా నాయకుడు పెండ్యాల అయిలయ్య డిమాండ్ చేశారు. శనివారం హుస్నాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముదిరాజ్ సంఘం నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాజయ్య, శ్రీనివాస్, వనేశ్, సంపత్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటరూరల్: మండల పరిధిలోని రాఘవాపూర్ ప్రధాన చౌరస్తావద్ద సీతారాంపల్లి, రాఘవాపూర్ గ్రామాలకు చెందిన ముదిరాజ్ యువకులు పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ యువత సుధాకర్ దినేశ్, వెంకటేశ్, రాకేశ్, గణేశ్, వెంకట్, బాల్‌రాజు, కనకరాజు పాల్గొన్నారు.

మద్దూరు(హుస్నాబాద్): మండల కేంద్రంలో కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను ముదిరాజ్ సంఘం నాయకులు దహనం చేశారు. రేబర్తి ఎంపీటీసీ రాజు, బీజేపీ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి సంఘీభావం తెలిపారు.

ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



బస్‌పాస్‌లు అందజేస్తున్న ఎంపీపీ కృష్ణారెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి అన్నారు. శనివారం దూళ్మిట్ట మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల వసతులు కల్పిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్‌కు దీటుగా కార్పొరేట్ స్థాయిలో విద్యనందిస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దుబ్బుడు దీపికావేణుగోపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల నాయకులు నాచగోని వెంకట్‌గౌడ్, సాయిలు, కృష్ణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ బోనాల జాతరను విజయవంతం చేయండి

చిన్నకోడూరు(సిద్దిపేట): కుమ్మర్ల తొలి బోనాల జాతరను విజయవంతం చేయాలని కుమ్మర సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం చిన్నకోడూరులో కుమ్మర సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆషాఢమాసాన్ని పురస్కరించుకొని ఆదివారం సిద్దిపేటలో జిల్లా కుమ్మర సంఘం ఆధ్వర్యంలో కుమ్మర్ల తొలి బోనాల జాతర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కుమ్మర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జాతర జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో బోనాల జాతర కమిటీ సభ్యులు, ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

◆ బీసీ కులవృత్తుల సాయానికి 770 దరఖాస్తులు

అక్కన్నపేట(హుస్నాబాద్): బీసీ కులవృత్తులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తానన్న రూ.1లక్ష ఆర్థికసాయం కోసం మండలంలో 770మంది దరఖాస్తులు చేసుకున్నారని ఎంపీడీఓ కొప్పుల సత్యపాల్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చిన దరఖాస్తులను ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నుంచి పరిశీలన ప్రారంభించామన్నారు. ఈ నెల 26వరకు పరిశీలించి, అనంతరం దరఖాస్తులను కలెక్టర్ కార్యాలయానికి పంపించనున్నామన్నారు. అనంతరం ఎంపిక కమిటీ వాటిని మరోసారి పరిశీలించి అర్హులైన లబ్ధిదారులను గుర్తిస్తుందన్నారు.

◆ చిన్నపాటి వర్షానికే రోడ్లు జలమయం



జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో చిన్నపాటి వర్షానికే సీసీరోడ్లు బురదమయంగా మారుతున్నాయి. సీసీరోడ్లపై వర్షం నీరు నిలవడంతో ప్రజలు ఈ రోడ్డు గుండా వెళ్లేందుకు జంకుతున్నారు. బీసీ కాలనీలో సీసీరోడ్లు పల్లవి ప్రాంతంగా ఉండడంతో నీళ్లు నిలుస్తున్నాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షాలకే ఇలా అయితే భారీ వర్షాలకు రోడ్లు దెబ్బ తినే అవకాశం ఉందని వాపోతున్నారు.

◆ రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలి

కొండపాక(గజ్వేల్): రైతుబంధు పథకంలో పెట్టుబడి సాయం పొందేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని మండల వ్యవసాయాధికారి ప్రియదర్శిణి పేర్కొన్నారు. మండల కేంద్రమైన కొండపాకలో శనివారం ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 16వ తేదీవరకు పట్టాదార్ పాస్ బుక్ పొందిన రైతులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులను ఆయా గ్రామాల ఏఈఓలకు అందజేయాల్సి ఉంటుందన్నారు. ఇదివరకు రైతుబంధు పథకం పొందని రైతులు సైతం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పట్టాదార్ పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్‌తో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని రైతుబంధు పథకాన్ని పొందాలని ఆమె కోరారు.

◆ దరఖాస్తుకు ఆహ్వానం

రాయపోలు(దుబ్బాక): దౌల్తాబాద్ మండలం కోనాయపల్లిలో ఆశకార్యకర్త పోస్టు ఖాళీగా ఉందని, ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని దౌల్తాబాద్ పీహెచ్‌సీ వైద్యాధికారి డా.నాగరాజు తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణురాలై 25 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల వయస్సులోపు ఉన్న గ్రామానికి చెందిన మహిళ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు స్థానిక పీహెచ్‌సీలో సంప్రదించాలని సూచించారు.

◆ విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని శనిగరం ఎస్సీ బాయ్స్ హాస్టల్‌లో విద్యార్థులకు హాస్టల్ వార్డెన్ పోగుల రాజు నోట్‌బుక్స్, షూస్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు.

◆ నో బ్యాగ్‌డే.. సందడిగా గడిపిన విద్యార్థులు

గజ్వేల్‌రూరల్: నో బ్యాగ్‌డే రోజు విద్యార్థులు ఆటపాటలతో సందడిగా గడిపారు. ప్రతి నెల 4వ శనివారం పాఠశాలల్లో నో బ్యాగ్‌డేను నిర్వహిస్తామని ఎంఈవో సునీత తెలిపారు. ఈ సందర్భంగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో గల ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో నో బ్యాగ్ డే సందర్భంగా ఉపాధ్యాయులు శనివారం విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు పాల్గొని సందడి చేశారు.

◆ పాఠశాలల బంద్‌ను విజయవంతం చేద్దాం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఏబీవీపీ ఆధ్వర్యంలో ఈ నెల 26న విద్యాసంస్థల బంద్‌ను నిర్వహిస్తున్నట్లు పట్టణ కార్యదర్శి పవన్‌కుమార్ అన్నారు. శనివారం ఏబీవీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పవన్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్ వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ విద్యాసంస్థల బంద్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పానిందర్, శ్రీషాంత్, నవీన్, కిట్టు, మహేశ్, ఆకాశ్, భువన్ పాల్గొన్నారు.

◆ కలెక్టరేట్ ముట్టడికి తరలిరావాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈనెల 26న కలెక్టరేట్ ముట్టడిని నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ ముట్టడి నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.